క్లుప్తంగా

టీడీపీ ఫ్లెక్సీలను తొలగించారు

సాక్షి ఇంపాక్ట్



టీడీపీ జెండా తొలగించిన చోటు

అంబాజీపేట: ఎన్నికల కోడ్ అమలులో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ‘సాక్షి’ దిన పత్రికలో ఈనెల 9వ తేదీన ఎన్నికల కోడ్ అపహాస్యం అనే శీర్షిక ప్రచురితమైన ఫొటోల కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఇరుసుమండ పంచాయతీ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న టీడీపీ జెండాను, విద్యుత్ స్తంభాలకు ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి తన సిబ్బందితో తొలగించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన సత్తెమ్మ తల్లి ఆలయాన్ని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దర్శించుకున్నారు. గ్రామ దేవత అమ్మవారి తీర్థ, జాతర మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సర్పంచ్ కట్టా రామకృష్ణ, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, ఏపీసీఎస్ మాజీ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, గొలుగూరి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న అమ్మవార్ల జాతర



మగటపల్లి గ్రామ దేవతలు

మామిడికుదురు: మగటపల్లి గ్రామ దేవతలు ధనమ్మ, వనువులమ్మ వార్ల జాతర ఈ నెల 12న జరుగుతుందని ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. అయిదు రోజుల పాటు అమ్మవార్ల జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 12వ తేదీ బుధవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి అమ్మవార్ల జాతర ప్రారంభమవుతుందన్నారు. అయిదు రోజుల పాటు అమ్మవార్లకు భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని తెలిపారు. 16వ తేదీ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా తృతీయ వార్షికోత్సవం



ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో వేంచేసిన ఉమామహేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిపారు. స్వామికి ఆలయ అర్చకుడు విశేష పూజలు జరిపారు. స్వామిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు జిలగం హేమలత, నాయకులు మేడిశెట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఆలమూరు, మండపేట టౌన్, కపిలేశ్వరపురం మండలాలకు గీత కార్మికుల కోసం కేటాయించిన మూడు మద్యం షాపులకు 84 దరఖాస్తులు అందినట్లు సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా సంబంధించి ఆలమూరుకు 31, కపిలేశ్వరపురం 17, మండపేట టౌన్‌కు 36 దరఖాస్తులు అందాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటికీ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించమన్నారు. ఈనెల 10న లాటరీ విధానంలో ముగ్గురికి ఈ మద్యం షాపులు కేటాయించనున్నట్లు సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

నులిపై యుద్ధానికి సిద్ధం

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- నులిపురుగుల నిర్మూలనపై అవగాహన



పెనికేరులో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది (ఫైల్)

ఆలమూరు: చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుంది. చిన్నారుల్లో నులిపురుగు నివారణకు ఏడాదికి రెండు సార్లు క్రమం తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం ద్వారా చిన్నారులకు మరింత ఆరోగ్యం చేకూరి చురుకుతనం ఏర్పడేందుకు దోహదపడుతుందని వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించింది. క్లస్టర్ పరిధిలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 11 పీహెచ్‌సీల్లో ఈనెల 10, 17 తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసే డీ వార్మింగ్ డే నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న సుమారు 1.20 లక్షల మందికి ఈఆల్బెండజోల్ మాత్రలను అందించవలసి ఉంది. క్లస్టర్ పరిధిలోని ఆయా పీహెచ్‌సీల్లో నిష్ణాతులైన 48 మంది వైద్యులతో పాటు 38 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 32 మంది ఫార్మసిస్టులు, 214 మంది ఏఎన్‌ఎంలు, 540 మంది ఆశ కార్యకర్తలు డీ వార్మింగ్ డేలో పాల్గొని సేవలను అందించనున్నారు.

నులిపురుగు వల్ల కలిగే దుష్ఫలితాలు

కడుపులో పేరుకుపోయిన నులిపురుగు వల్ల పిల్లల్లో తీవ్రఅనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. పిల్లల కడుపులో సంభవించే కొంకి, నులి, బద్దె తదితర గుండ్రని పురుగులు రక్తాన్ని పీల్చేస్తాయి. పురుగుల ఎదుగుదల పూర్తిగా పిల్లల కడుపులోనే జరగడం వల్ల ఎదుగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు తీసుకునే ఆహారం అంతా ఆ పురుగులే పీల్చేయడం వల్ల చిన్నారులకు అనేక రుగ్మతలు సంభవిస్తాయి. కడుపులోని నులి పురుగుల ప్రభావం వల్ల పదేళ్ల లోపు పిల్లలకు అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడి శారీరక సమస్యలు ఏర్పడతాయి. నులిపురుగులు ఉన్న పిల్లలు మలం వల్ల నేలను కలుషితం అవుతుంది. ఆ క్రిములు విస్తృతంగా వృద్ధి చెందుతాయి. ఈ క్రిముల వ్యవస్థ గుడ్లను ఉత్పత్తి చేసే దశకు చేరుకోవడంతో ఆ ప్రభావం మళ్లీ పిల్లలకు పడి ఆరోగ్యాన్ని మరింత జటిలం చేస్తుంది.

ఏర్పాట్లు పూర్తి

డీవార్మింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో మోతాదుకు అనుగుణంగా ఒకటి నుంచి 19 యేళ్ల లోపు వయస్సు కలిగిన వారందరికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తాం. ఏ విధమైన దుష్పరిణామాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ఉమ, హెల్త్ విజిటర్, పెదపళ్ల పీహెచ్‌సీ

సంపూర్ణ ఆరోగ్యం

పిల్లల వయస్సుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుంది. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కుని మాత్రలను వేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి.

– ఎం.సుమలత, డివిజన్ అదనపు వైద్యాధికారి, కొత్తపేట

వైభవంగా సత్తెమ్మ తల్లి జాతర



వాడపాలెంలో వేంకటేశ్వర మహాత్మ్యం ప్రదర్శనలో ఓ ఘట్టం

కొత్తపేట: వాడపాలెంలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం అంబరాన్ని తాకాయి. బండారు వారి ఆడపడుచుగా విరాజిల్లుతున్న సత్తెమ్మతల్లి ఆరో వార్షికోత్సవ జాతర మహోత్సవాలు నాలుగు సంవత్సరాలు అనంతరం జరుగుతున్న విషయం తెలిసిందే. ఆది నుంచీ ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు చింతపల్లి బాలుతో పాటు ఈ ఏడాది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, స్థానిక యువజన నాయకుడు కట్టా శ్రీను తదితరుల ఆధ్వర్యంలో స్థానికులు, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికుల సహకారంతో భారీ వ్యయంతో ఈ నెల ఒకటి నుంచి ఉత్సవాలు చేపట్టారు. వరుసగా 8 రోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహించగా తొమ్మిదో రోజు అమ్మవారిని గ్రామ పొలిమేర వరకూ సాగనంపే సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక పూజలు, భారీ ఎత్తున వివిధ కళా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దానిలో భాగంగా అమ్మవారి ఆలయం ముందు పంచరంగులతో పద్మం అలంకరించి, మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం మేళతాళాలతో అమ్మవారిని గ్రామ పొలిమేర వరకూ సాగనంపారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 1500 మంది కళాకారులతో కళా, సంస్కృతిక ప్రదర్శనల పర్వం ప్రారంభమైంది. వాటిలో వేంకటేశ్వరస్వామి మహాత్మ్యం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అనేక మంది గ్రామస్తులు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, వాడపాలెం తదితర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్తెమ్మతల్లిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వారి వెంట మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు త్సామా బాబు, బూసి జయలక్ష్మి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా బాబ్జి తదితరులు ఉన్నారు.

అనుబంధ విభాగాలతో పార్టీ బలోపేతం



కొత్తపేట నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

సన్మానించి అభినందనలు తెలిపిన చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలతో గ్రామ స్థాయిలో మరింతగా బలోపేతం కావాలని ఆ దిశగా బాధ్యతలు తీసుకున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ జిల్లా, నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులు నియమితులైన కార్యకర్తలు, నాయకులు ఆదివారం సాయంత్రం మండలంలోని గోపాలపురంలో జగ్గిరెడ్డిని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని జగ్గిరెడ్డి దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి డేవిడ్‌రాజు, అలాగే కొత్తపేట నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగానికి పాల నాగేశ్వరరావు, రైతు విభాగానికి పెదపూడి బాపిరాజు, బీసీ సెల్ విభాగానికి బొక్కా ప్రసాద్, ఐటీ విభాగానికి కొవ్వూరి సుధాకర్ రెడ్డి, యువజన విభాగానికి నడింపల్లి వెంకటసుబ్బరాజు (వర్మ), విద్యార్థి విభాగానికి గొల్లపల్లి రాజశేఖర్ వివిధ స్థాయిల్లో అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతలపై కష్టపడతామని మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, అలాగే చిర్ల జగ్గిరెడ్డి ఎమ్మెల్యే చేసే వరకూ శ్రమిస్తామన్నారు. చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కష్టపడే నాయకులు, కార్యకర్తలందరికీ కచ్చితంగా ఉన్నత స్థానాల్లో పెట్టేలా కృషి చేస్తానన్నారు. అలాగే 2019 నుంచి 2024 మధ్యలో కార్యకర్తలు కొద్దిగా నిరుత్సాహం పొందిన విషయం తెలుసుకుని జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకి ఈసారి పెద్దపీట వేస్తానని భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన డేవిడ్‌రాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

చిత్రకారుడికి సన్మానం



నారాయణ గీసిన ఎండిన చెట్టు చిత్రాన్ని వీక్షిస్తున్న నిర్వాహకుడు ఆకొండి అంజి

మలికిపురం: మాస్టర్ స్ట్రోక్ 4 లో భాగంగా క్రియేటివిటీ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడైన ఆకొండి అంజి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆర్ట్స్ చిత్రాల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా హైదరాబాదులో జేఎన్టీయూ నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో పలువురు చిత్రకారులతో చిత్రించిన చిత్రాలు మూడో రోజయిన ఆదివారం కూడా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మలికిపురం మండలం బట్టేలంక గ్రామానికి చెందిన వైవీఎస్ నారాయణ గీసిన చిత్రాన్ని ప్రదర్శించారు. నారాయణ చిత్రించిన చిత్రం ప్రకృతి వనంలో అన్ని చెట్లు సమానంగానే కనిపిస్తాయి. అది ఎండిన పచ్చదనంతో ఉన్న ప్రకృతి ఎప్పుడు అందంగానే ఉంటుందనే అంశంతో చిత్రించిన చిత్రం అమితంగా ఆకట్టుకుంది. ఇందుకు గాను నారాయణను ప్రత్యేక మెమెంటోతో సన్మానించారు.

ముగిసిన లఘు రుద్ర మహాక్రతువు



గంగలకుర్రులో హోమం నిర్వహిస్తున్న పండితులు

అంబాజీపేట: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మాస శివరాత్రి అభిషేక కమిటీ ఆధ్వర్యంలో గంగలకుర్రులో నిర్వహించిన లఘు రుద్ర మహాక్రతువు ఆదివారం రాత్రి వైభవంగా ముగిసింది. క్రతువు నిర్వాహకుడు యడ్లవల్లి వెంకట యజ్ఞ నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్థానికంగా వేంచేసియున్న సర్వ మంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక లఘు రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచి గణపతి పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నవగ్రహార్చన, బిల్వార్చన, కుంకుమార్చన, గణపతి, రుద్ర హోమాలు, చండీ, అరుణ, ఆదిత్య హృదయ పారాయణ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సర్వమంగళ పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం విశాఖపట్నానికి చెందిన కలగ మురళీకృష్ణతో ప్రవచనాలు నిర్వహించారు.

అదే జోరు.. అదే సందడి



- తీర్థానికి తరలివచ్చిన భక్తులు
- ఆహ్లాదం అందిస్తున్న రంగులరాట్నం

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో ఆరో రోజు ఆదివారం కూడా భక్తుల రద్దీ యథావిధిగా ఉంది. సెలవురోజు కావడంతో స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో అంతర్వేది పురవీధులు కళకళలాడాయి. మాఘమాసంలో సముద్ర స్నానాలకు విశిష్టత ఉండడంతో భక్తులతో బీచ్ కిటకిటలాడింది. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామిని క్యూలో వెళ్లి దర్శించుకున్నారు. లక్ష్మీనృసింహునితో పాటు, క్షేత్రపాలకుడైన నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, గుర్రాలక్క, వశిష్టాసేవాశ్రమాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

గ్రామోత్సవాలు

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం గజ వాహనంపైన, రాత్రి పొన్న వాహనంపైన స్వామివారి గ్రామోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గజం బుద్ధికి సంకేతం. భక్తుడు బాగా ఆలోచించి, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల వైపు భక్తులను నడిపించేందుకు స్వామి గజ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సర్వస్వం నీవే అన్న గోపికల ఆత్మనివేదనను స్వీకరించినట్టుగా భక్తుల ఆత్మ నివేదనను స్వీకరించేందుకే పొన్న వాహనంపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

పాలమూరు సత్రం ఆధ్వర్యంలో..

రాత్రి 7 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు సత్రం నిర్వాహకులతో స్వామికి అన్నపర్వత మహానివేదన వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని చేశారు. దీని నిమిత్తం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ దర్శనాలు నిలిపి, శ్రీస్వామివారి సన్నిధి శుద్ధి చేసి శాస్త్రోక్తంగా స్వామికి అన్నపర్వత మహానివేదన చేశారు. అన్నపర్వత మహానివేదన అనంతరం యథావిధిగా భక్తులకు స్వామివారి దర్శనాన్ని దేవస్థానం కల్పించింది.

నోరూరించే జీళ్లు, ఆహ్లాదాన్ని పంచే రంగుల రాట్నాలు

తీర్థంలో దుకాణదారులు సిద్ధం చేస్తున్న జీళ్లు భక్తులకు నోరూరిస్తున్నాయి. అలాగే ఖర్జూరం కూడా భక్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. భక్తితో పాటు ఆహ్లాదాన్ని అందించే జెయింట్ వీల్స్, రంగుల రాట్నం, ఉయ్యాల పడవ వద్ద పిల్లాపాపలతో తల్లిదండ్రులు సంతోషంగా గడిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఆయన వివరించా రు. పరిసర ప్రాంత ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

రజకుల బల్లల పండగకు విరాళం



ఆలమూరులో రజక ఉత్సవ కమిటీకి విరాళాన్ని అందిస్తున్న దాత ప్రభాకరరావు

ఆలమూరు: స్థానిక రజకులు ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే బల్లల పండగకు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త చల్లా ప్రభాకరరావు రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ మేరకు ఆదివారం ఆయన నివాసంలో రజక ఉత్సవ కమిటీ ప్రతినిధులు దువ్వాపు సుబ్బారావు, యెరుకొండ మునలయ్య, టేకి గంగరాజు తదితరులకు దాత ప్రభాకరరావు నగదు రూపంలో విరాళాన్ని అందజేశారు.

పాఠశాలకు బీరువా అందజేత



పాఠశాలకు బీరువా అందిస్తున్న దాతలు

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో కోరుకొండ రోషన్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుడు కోరుకొండ రాజు, ఆయన అల్లుడు దొండపాటి బాలరాజు సమకూర్చిన రూ.13 వేల విలువైన బీరువాను గ్రామంలోని బుద్ధనగర్ పాఠశాలకు అందించారు. ఈ స్థానిక సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు తాడి ఆనందరావు, ఉపాధ్యక్షుడు దేవ రామదాసు పాల్గొని దాతలను అభినందించారు. రాపాక కేశవరావు, దొండపాటి చాందిని, దొండపాటి మెల్విన్, కోరుకొండ రాజబాబు, తాడి పెద్దిరాజు, పాఠశాల చైర్మన్ మైలా స్రవంతి, పాఠశాల ఉపాధ్యాయులు పంగం నీలారావు, అక్కిరెడ్డి శైలజ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉత్తమ ఫలితాలు

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని డీపీఎం జె.ఎలియాజర్ సూచించారు. ఆయన ఈదరాడలో డీపీఎం సత్యనారాయణతో కలసి ఆదివారం పర్యటించారు. అక్కడ శాశ్వత జీవామృతం పిట్‌ను పరిశీలించారు. జీవామృతాన్ని రైతులకు అందించాలని సూచించారు. దేశీయ రకం వరి కూజీ పటాలియా పంట పొలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బీఎస్ఎఫ్ లార్వా, పేడ, కూరగాయల వ్యర్థాలతో తయారు చేసే సేంద్రియ ఎరువు నుంచి వచ్చే పురుగులను కోళ్లకు దాణాగా వినియోగించడంతో పాటు ఎరువును పంటలకు ఎరువుగా వినియోగించాలన్నారు. 100 కిలోల కోళ్ల ఎరువు, 100 కిలోల పశువుల ఎరువు, 100 కిలోల మేకల ఎరువుపై జీవామృతం చల్ల 21 రోజులు మగ్గించిన తర్వాత సేంద్రియ ఎరువుగా పంట పొలాలు, కొబ్బరి తోటలకు డీఏపీ ఎరువుగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అంబాజీపేట: స్థానిక కోరివారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 12 స్వామి వారి పుష్పోత్సవాన్ని జరపనున్నట్లు భక్తబృందం తెలిపారు.

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామదేవతగా పూజలందుకుంటున్న వనుములమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఘనంగా జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి చలివిడి, వడపప్పు, బెల్లం పానకం నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి కానుకలు, మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారి చల్లని చూపులు పిల్లా పాపలతో సుఖసంతోషాలతో తులతూగేలా కాపాడాలని గ్రామస్తులు వేడుకున్నారు.

భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతం

అయినవిల్లి: భగవద్గీత పఠనం వల్ల భక్తుల తలరాత మారుతోందని, భక్తుల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించిన వారికి అనుక్షణం ప్రశాంత వాతావరణం, సంతోషంగా ఉంటారని, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

కోదండరామస్వామి విగ్రహాలకు గ్రామోత్సవం

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు ఆదివారం గ్రామోత్సవం జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని విగ్రహాలను ట్రాక్టర్‌పై విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నూతన విగ్రహాలను భక్తులు సందర్శించుకుని కానుకలు సమర్పించారు. ఈ నెల 15న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవవ సందర్భంగా 13వ తేదీ నుంచి విశిష్ట పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దునే స్వామినాయుడు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని క్రాపపాలెంలో హనుమత్ సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, వశిష్ఠ సపరివార సమేత పట్టాభిరామస్వామి వారి ఆలయ సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. సోమవారం ఉదయం 11.14 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.

బీజేపీ విజయోత్సవ వేడుకలు

మలికిపురం: ఢిల్లీలో బీజేపీ ఘనవిజయం సాధించటంపై ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య ఆధ్వర్యంలో మలికిపురం గాంధీ బొమ్మల కూడలిలో కూటమి నాయకులతో కలసి ఘనంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమం, అభివృద్ధి వల్లే ఢిల్లీతో పాటు వివిధ రాష్ట్రాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని, ఆమ్ ఆద్మీ అవినీతి పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారని అన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీ వేమా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎఫ్‌సీఐ డైరెక్టర్ దొడ్డ నాగబాబు, అడబాల రాంబాబు, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి పాల్గొన్నారు.

భక్తజన కోలాహలం

మామిడికుదురు: పవిత్ర మాఘమాసం సందర్భంగా అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. మాఘ ఆదివారం వైనతేయ గోదావరి నదీ స్నానం ఎంతో పవిత్రమైనది కావడంతో విశేష సంఖ్యలో భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామికి తల నీలాలు సమర్పించారు. పాత గుడితో పాటు, కొత్త గుడి వద్ద భక్తులు గోవిందా, గోవింద అంటూ సందడి చేశారు. ఆలయ చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని బాలబాలాజీ స్వామిని వేడుకున్నారు. 4,300 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 2,800 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,78,900 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. లడ్డుప్రసాదం విక్రయం ద్వారా రూ.56,850 వచ్చిందని, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.79,506 విరాళాలుగా అందించారన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

మామిడికుదురు: జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నగరం గ్రామానికి చెందిన నీతిపూడి బాల సత్యనారాయణను నియమించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను నగరం గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అందజేశారు. పి.గన్నవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నియమితులైన బాల సత్యనారాయణను చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.